# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఎన్డీయే పాలనలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2.** **ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు రాష్ట్రంలో పర్యటిస్తారు.**

**3.** **రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించనున్న వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది.**

**4.** **ఈరోజు నుంచి ఈనెల 10వ తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును చెల్లించవచ్చని రాష్ట్ర ఇంటర్ బోర్డు పేర్కొంది.**

**5.** **ప్రపంచ వ్యాప్తంగా ఈరోజు తలసేమియా వ్యాధి అవగాహన దినాన్ని పాటిస్తున్నారు.**

==========================

పదేళ్ల ఎన్డీయే పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయాన్ని ఆధునికీకరించి లాభసాటిగా మార్చామని, వ్యవసాయ రంగంలో డ్రోన్లను ప్రోత్సహించామని ఆయన తెలిపారు.

------------------------

ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు రాష్ట్రంలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరిలో నిర్వహించనున్న బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సాయంత్రం 7గంటలకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎంజీ రోడ్డులో ఇందిరాగాంధీ స్టేడియం నుండి బెంజ్ సర్కిల్ వరకు నిర్వహించే రోడ్డు షోలో పాల్గొంటారు. ఈ రోడ్డు షో లో ప్రధానమంత్రితో పాటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కల్యాణ్లు హాజరవుతారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

------------------------

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రోడ్ షో సందర్భంగా విజయవాడలో ఈ రోజు గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ మళ్లించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడ వైపునకు వెళ్లే వాహనాలు బుడంపాడు అండర్ పాస్ నుంచి నారా కోడూరు, చేబ్రోలు, పొన్నూరు, చందోలు చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె, అవనిగడ్డ, మచిలీపట్నం మీదుగా హనుమాన్ జంక్షన్ దగ్గరలోని జాతీయ రహదారి –16 వైపు వెళ్లాలని సూచించారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు చుట్టుగుంట నుంచి పేరేచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్లాలని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించనున్న ఐదు వైద్య కళాశాలల్లో 31అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు నిన్న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రత్యక్ష, పార్శ్వ ప్రవేశ విధానాల్లో పోస్టుల భర్తీ చేపడతామని బోర్డు కార్యదర్శి ఎం. శ్రీనివాస రావు తెలిపారు. పూర్తి నోటిఫికేషన్ ను dme.ap.nic.in వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ రోజు నుంచి ఈనెల 17వతేదీలోగా ఆన్ లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

---------------------------

వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్ల కోసం ఎన్నికల సంఘం ప్రత్యేకంగా సక్షం యాప్‌ను ప్రవేశపెట్టిందని బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టర్ నిన్న బాపట్లలో మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు ఓట్లు వేయటానికి తమ ఫోన్లలో సక్షం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. యాప్‌లో ఓటర్లు పేర్లు నమోదు చేయగానే వారి పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుస్తాయని అన్నారు. ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి వెళ్లి రావటానికి వాహనం కోసం యాప్‌లో అభ్యర్థన చేసుకోవచ్చని తెలిపారు. మే 13న పోలింగ్ కేంద్రాల వద్ద మూడు చక్రాల సైకిల్ అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు రాష్ట్ర ఇంటర్ బోర్డు అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు అడ్వాన్స్‌డ్ పరీక్షలకు ఫీజు చెల్లించని వారు ఈ అవకాశం వినియోగించుకోవాలని పరీక్షల విభాగం అధికారి సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రోజు నుంచి ఈనెల 10వ తేదీ వరకు 3 వేల రూపాయల ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావొచ్చని ఆయన సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యా ర్థులతో ప్రతి సంవత్సరం యూత్ పార్లమెంట్ పోటీలు నిర్వ హించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ నిన్న ఆదేశాలు జారీ చేశారు. ప్రజాస్వామ్య మూలాలను బలోపేతం చేయడం, క్రమశిక్షణ, ఇతరుల అభిప్రాయాలను వినడం, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడం, పార్లమెంటు పనివిధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇందుకోసం భారత ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

కార్యదర్శి ఆర్థిక సహాయం అందిస్తారని పేర్కొన్నారు. యూత్ పార్లమెంట్ పోటీల సమగ్ర సమాచారం వెబ్‌సైట్‌లో ఉందని పేర్కొన్నారు.

---------------------------

ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు  పోస్టల్ బ్యాలెట్ ను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం జిల్లా డీపీఓ ప్రభాకర్ రావు సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఈ రోజు  సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటీషియన్ కేంద్రాల్లో ఓటు వేయవచ్చని తెలిపారు. ఈ రోజు  తుది గడువు కావడంతో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. అదేవిధంగా  అత్యవసర సేవల్లో  పనిచేసే ఉద్యోగులు పోస్టల్ ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా ఈరోజు తలసేమియా వ్యాధి అవగాహన దినాన్ని పాటిస్తున్నారు. తల్లిదండ్రుల్లోని జన్యుపరమైన లోపాల వల్ల పిల్లల్లో కలిగే రక్తహీనత వ్యాధినే తలసేమియా అంటారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల్లో రక్తహీనతను ఎదుర్కోవడం ప్రధాన సమస్య. పిల్లలకు ప్రాణాంతకమైన ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ఈరోజు తలసేమియా నివారణ దినంగా పాటిస్తున్నారు.

---------------------------

నంద్యాల జిల్లాలో  పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని  జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు తెలిపారు. నిన్న  జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో  నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ లో అత్యవసర సర్వీసులకు చెందిన ఉద్యోగులు 6,958 మంది వినియోగించుకున్నారని అన్నారు. రెండు రోజుల్లో 76.4 శాతం అత్యవసర సర్వీసుల, ఎన్నికల విధుల ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో  శ్రీపద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. తిరుమల నారాయణ గిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో శ్రీమలయప్పస్వామి తొలిరోజు  గజ వాహనం, రెండవ రోజు అశ్వ వాహనం, చివరిరోజు గరుడ వాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క  ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వస్తారు. ఆ తర్వాత కల్యాణమహోత్సవం నిర్వహిస్తారని టీటీడీ తెలిపింది.  పరిణయోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

---------------------------

విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్, రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్‌ఖర్ నేతృత్వంలో తూర్పు నౌకాదళ ప్రతినిధి బృందం సింగపూర్‌లోని సమాచార ఫ్యూజన్ కేంద్రాన్ని సందర్శించింది. పర్యటన సందర్భంగా ప్రస్తుత సముద్ర భద్రత , పర్యావరణ పరిరక్షణ,  వంటి అంశాలపై ప్రతినిధి బృందం చర్చలు జరిపిందని నౌకాదళ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో భాగస్వామ్య సముద్ర సవాళ్లను పరిష్కరించడానికి సహకార విధానాన్ని ప్రోత్సహించే చర్యలపై చర్చించినట్లు వివరించారు. ఈ పర్యటన ద్వారా సముద్ర భద్రతా

సహకారాన్ని పెంపొందించడంతో పాటు భారత్, సింగపూర్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు దోహదం చేస్తుందని నౌకాదళ అధికారులు వెల్లడించారు.

---------------------------

ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిన్న సూక్ష్మ పరిశీలకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ రహస్యంగా, ప్రశాంతంగా జరగాలని అన్నారు. ఓటరు మాత్రమే ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రావాలని, ఇతరులు ఎవరినీ లోపలికి అనుమతించరాదని స్ప ష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో హింసాత్మక ఘటనలు జరిగితే ప్రిసైడింగ్ అధికారి, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు.

======================